ప్రజాశక్తి
సోమవారం 6 జనవరి 2025
5
శ్రీ సత్యసాయి

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు 'పాముదుర్తి' ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండలంలోని పాముదుర్తి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న హను మంతు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మూడు పతకాలు సాధించాడు. ఆయన క్రీడల్లో గెలుపు, ఓటములకు వయసుతో సంబంధం లేదని చాటి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై యువతకు ఆదర్శంగా నిలిచారు. మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని జెఎన్‌టియు ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో నిర్వహించిన అథ్లెటిక్స్ సెలక్షన్స్‌లో 40 ఏళ్ల పైబడిన వారికి నిర్వహించిన 100 మీటర్ల రన్నింగ్ రేస్ హనుమంతు బంగారు పతకం, 800 మీటర్ల విభాగంలో కాంస్యం, షార్ట్‌పుట్‌లో రజత పతకం సాధించి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన ఉపాధ్యాయుడు హనుమంతును అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.సుధాకర్‌బాబు, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

కరువును చూసేందుకు ఇప్పుడా..!

'దొంగలు పడ్డ ఆరు మాసాలకు...' అన్న నానుడికి కేంద్రకరువు బృంద పర్యటన సరిగ్గా సరిపోతోంది. రబీ సీజన్ కూడా ముగుస్తున్న సమయంలో కేంద్ర కరువు బృందం జిల్లా పర్యటనకు రానుంది. ఈనెల ఎనిమిదవ తేదీన అనంతపురం జిల్లాలో పర్యటించనుంది. ఈ మేరకు షెడ్యుల్ ఖరారైనట్లు సమాచారం. 2024 ఖరీఫ్‌లో నెలకొన్న కరువును ఈ బృందం పరిశీలించనుంది. అనంతపురం రూరల్ మండలంలోని మన్నీల గ్రామంలోని పొలాల్లో పర్యటించి పంట పరిశీలన చేయనుంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

8న కేంద్ర కరువుబృందం పర్యటన

జిల్లాలో 2024లో కరువును రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు మాసంలో ప్రకటించింది. ఇందులో రెండు మండలాల్లో తీవ్రమైన కరువు నెలకొందని ప్రకటించింది. నార్పల, అనంతపురం రెండు మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని ప్రకటించింది. బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, రాప్తాడు, విడపనకల్లు, యాడికి ఈ ఐదు మండలాల్లో మధ్యస్థంగా కరువు ఉన్నట్టు నిర్ధారించింది. ఇందులో మొత్తం 12856 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేశారు. దీనికి రూ.19.98 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అవసరమని ప్రతిపాదించారు. ఇందులో అత్యధిక నష్టం వేరుశనగ పంటనే ఉంది. వేరుశనగ పంట నష్టానికి సంబంధించి 7796 హెక్టార్లకుగానూ రూ.13.25 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు. పత్తి పంట 2849 హెక్టార్లకు రూ.4.84 కోట్లు, ఆముదం 1500 హెక్టార్లకు రూ.1.27 కోట్లు, 361 హెక్టార్లలో జొన్న నష్టానికి రూ.30 లక్షలు, 20 ఎకరాల్లో పెసరకు రూ. 2 లక్షలు, 327 ఎకరాల్లో కొర్ర పంటకు రూ.27 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు.

కరువు మండలాల పున: సమీక్ష నిర్ణయం ఏమైందో ?

కరువు మండలాల ప్రకటనలో హేతుబద్ధలేదని, పున:సమీక్షించాలని నవంబరులో జరిగిన జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో తీర్మానించారు. అధికారపార్టీకి చెందిన నేతలే దీన్ని ముందుకు తీసుకొచ్చారు. అయితే తరువాత దీనిపై అధికారులు ఏ రకమైన చర్యలు తీసుకున్నారన్నది తెలియలేదు. కీలకమైన ఆగస్టులో వర్షాభావంతో పంటలు బాగా దెబ్బతిన్నాయని, అన్ని మండలాలను కరువు మండలాలు ప్రకటించాలని విపక్షాలు కూడా డిమాండ్ చేశాయి.

పర్యటన సాగునుంది ఇలా...

కేంద్ర కరువు బృందం ఈనెల ఎనిమిదవ తేడీ మధ్యాహ్నం రెండు గంటలకు సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం పర్యటన ముగించుకుని అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామానికి వస్తుంది. అక్కడ ఆముదం పంటను అధికారులు పరిశీలిస్తారు. అనంతరం 2.30 గంటల నుంచి బయలుదేరి రాప్తాడు మండలంలోని రాప్తాడు గ్రామం చేరుకుంటారు. అక్కడ నుంచి ఐదు గంటలకు పంట పరిశీలన అనంతరం బెంగళూరుకు వెళతారు.

'అనంత'లో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి - గుత్తి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రశాంత వాతావరణ నెలకొల్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. గుత్తి పట్టణంలోని జెడ్. వీరారెడ్డి భవనంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హంద్రీనీవా సుజల స్రవంతి సాగునీటి ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలు జిల్లాలో ఒక ఎకరాకు కూడా తడవడం లేదన్నారు. జిల్లాలోని ప్రతి ఎకరాకు కృష్ణా జలాలను అందించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు సోషల్ మీడియాలో పోస్టులు పెడితే వారిపై కేసులు నమోదు చేస్తున్న పోలీసులు అధికార పార్టీ నాయకులు మహిళలపై అసభ్యకరంగా పోస్టులు పెడుతుంటే ఎందుకు కేసులు పెట్టడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో మత రాజకీయాలు నడుస్తున్నాయని విమర్శించారు. జెసి.ప్రభాకర్ రెడ్డి నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో మహిళలు బురఖాలు ధరించి వస్తారని మతాల గురించి గురించి బిజెపి నాయకులు అనడం తగదన్నారు. జెసి.ప్రభాకర్ రెడ్డి తమ బస్సులను బిజెపి నాయకులు తగలబెట్టారని అనడంతో ఆయనపై రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రతి ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ప్రతిదానికి స్పందించే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జిల్లాలో ఇంత వివాదం నడుస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. జెసి బస్సులు కాలిన ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. శ్రీనివాసులు, నాయకులు కసాపురం రమేష్, సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, బి.రామకృష్ణ, కార్యదర్శి ఎన్. రేణుక, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్

రైల్వే అభివృద్ధికి సహకారం

రైల్వే, జలశక్తి సహాయ మంత్రి వి. సోమన్న

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయమంత్రి సోమన్న

ప్రజాశక్తి-పెనుకొండ

తెలుగు రాష్ట్రాల్లో రైల్వే అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని కేంద్ర రైల్వే, జలశక్తి సహాయ మంత్రి వి. సోమన్న అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి, సంక్షేమం, జౌళి శాఖ మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బికె.పార్థసారథి, ఎమ్మెల్సీ మంగమ్మ, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ టిఎస్. చేతన్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, రైల్వే చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అజయ్ శర్మ, అమితేష్ కుమార్ , బెంగళూరు డివిజనల్ రైల్వే మేనేజర్, అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్, వివిధ రైల్వే విభాగాలకు చెందిన అధికారులు, కూటమి నాయకులు, రైల్వే ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సోమన్న మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అంటే అభివృద్ధికి నిర్వచనం అని అన్నారు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన శ్రీకష్ణదేవరాయ కాలంనాటి రెండవ రాజధానిగా ఉన్న పెనుకొండలో ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ ప్రభుత్వం పని చేస్తోందని, ప్రస్తుతం ఈ వంతెన పెనుకొండ పట్టణం అనంతపురం ధర్మవరం, పుట్టపర్తి మధ్య రైల్వే ట్రాక్ మీదుగా రోడ్డు రాకపోకలకు అతుకులు లేకుండా సులభంగా ఉంటుందన్నారు. నేటితో పెనుకొండ వాసుల చిరకాల కోరిక నెరవేరిందని మంత్రి పేర్కొన్నారు. 2021 మార్చి 15 న రూ.33.50 కోట్లతో 63.4 మీటర్లు అనంతపురం వైపు 443 మీటర్లు, పెనుకొండ వైపు 130 మీటర్ల అప్రోచ్ పొడువుతో ఈ వంతెన నిర్మాణం ప్రారంభించామని నేడు ఇది ప్రజలకు ఉపయోగంగా ఉందని తెలిపారు. పెనుకొండలో రూ.20 కోట్ల రూపాయలతో గూడ్స్ నిర్మాణానికి పరిపాలన అనుమతి, రూ.3 00 కోట్లతో పెనుకొండ నుండి మక్కాజి పల్లి డబ్లింగ్ పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు. చాకర్లపల్లి వద్ద వంతెనను నెల రోజుల్లో ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. చాకర్లపల్లి వద్ద అసంపూర్తిగా ఉన్న పనులు, పెనుకొండ ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద అవసరమైన పనులకు 30 రోజుల్లో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రైల్వే శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. హిందూపురం ఎంపీ పార్థసారథి, మంత్రి సవిత, పుట్టపర్తి ఎమ్మెల్యేపల్లెసింధూర రెడ్డి అభ్యర్థనలను మంత్రి స్పందించి ఆయా ప్రాంతాలలో కూడా సత్వరమే రైల్వే అభివృద్ధి పనులను ప్రారంభించడం జరుగుతుందన్నారు.

రైల్వే మంత్రికి సన్మానం : పెనుకొండ రైల్వే బ్రిడ్జి ప్రారంభోత్సవానికి వచ్చిన రైల్వే శాఖ సహయ మంత్రి సోమన్నను త్రిపుర రిసార్ట్స్ యజమాని డాక్టర్ గోపీనాథ్ ఘనంగా సన్మానించారు. మంత్రి సోమన్న, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, హిందూపురం ఎంపీ పార్థసారథిలకు శాలువాలు కప్పి గజమాలతో సన్మానించారు. మంత్రి సోమన్నకు పెనుకొండ ప్రాంత సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, రవి, హనుమంతు యాదవ్, మండల కార్యదర్శి అమత, బాలగోపాల్, హరిలాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జోన్ ఏర్పాటు చేయాలి : రాష్ట్రంలో రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని, పెనుకొండ రైల్వే జంక్షన్‌ను అధునాతనంగా తీర్చి దిద్దాలని బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ,హైకోర్టు న్యాయవాది శివరామకష్ణ, డీవీఎంసీ మెంబర్ రామాంజినప్ప కోరారు. ఈ మేరకు వారు మంత్రి సవిత,హిందూపురం ఎంపీ బి. కె. పార్థసారధి సమక్షంలో కేంద్ర మంత్రికి వినతి పత్రం సమర్పించారు. సుదూర ప్రాంతాల మధ్య తిరిగే రైళ్లలో పేద, దిగువ మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని సాధారణ భోగిలను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి రవికుమార్, రాంపురం రామాంజనేయులు, రంగేపల్లి కదిరప్ప, కోనాపురం కొల్లప్ప, శెట్టిపల్లి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ ఆధునికరణకు చర్యలు

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి రైల్వే స్టేషన్ ఆధునికరణ,కొత్తచెరువు రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డును ఫ్లైఓవర్ బ్రిడ్జిగా మార్చాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కేంద్ర సహాయ మంత్రి సోమన్నకు వినతిపత్రం అందజేశారు. ఆదివారం పెనుగొండ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రి సోమన్నను పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా మహా సమాధి దర్శనార్థం పుట్టపర్తికి రావాలని ఎమ్మెల్యే ఆహ్వానించారు. పుట్టపర్తికి వచ్చిన కేంద్ర సహాయ మంత్రిని పుట్టపర్తి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్‌లో ఘన స్వాగతం పలికారు . ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ను ఆధునికరించాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు కోరారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రికి టిడిపి జిల్లా నాయకులు సామకోటి ఆదినారాయణ సత్యసాయి చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మాధవీలతకు క్షమాపణ

మిగిలిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా....
తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

'నటి మాధవీలతపై తాను చేసిన వ్యాఖ్యలకు చింతిస్తున్నా... ఆవేశంలో నోరుజారా.. ఆమెకు బేషరతుగా క్షమాపణ చెబుతున్నా.' అని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే బిజెపి నాయకులపై చేసిన మిగిలిన వ్యాఖ్యలకు తాను కట్టుబడి ఉన్నా అని చెప్పారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక మీడియాతో మాట్లాడారు. ఒక మహిళ పట్ల ఆ రకంగా మాట్లాడి ఉండకూడదని భావిస్తున్నానని అన్నారు. అయితే ఫ్లెక్సీగాళ్లు, బ్యానర్‌గాళ్లు తనపై మాట్లాడాన్ని అంగీకరించనన్నారు. తాను ఏ పార్టీలో చేరాలన్నది చెప్పడానికి సత్యకుమార్ ఎవరని అన్నారు. చంద్రబాబునాయుడి విజన్ నచ్చి తాను టిడిపిలో ఉన్నానని అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని తాడిపత్రి పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నానని చెప్పారు. తాడిపత్రి ప్రజల అండ తనకు పుష్కలంగా ఉందన్నారు. ఎక్కడి నుంచో వచ్చిన వారు కూడా తన గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వారికి పదవులు పోతే ఇక్కడ మాట్లాడే వారు ఉండరని అన్నారు. తాను మాత్రం తాడిపత్రి ప్రజలకు మేలు చేయడానికి కృషి చేస్తానని చెప్పారు.

పేదల సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పేద ప్రజల సంపూర్ణ ఆరోగ్యం, సేవే లయన్స్ క్లబ్ లక్ష్యమని అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాలా చార్యులు, రమేష్‌బాబు, కోశాధికారి నాగేంద్ర తెలిపారు. చెన్నంశెట్టి నాగభూషణం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు లయన్ చెన్నంశెట్టి జగదీశ్వరప్రసాద్ సహకారంతో పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు వెంకటస్వామి, కంటి ఆసుపత్రి ప్రమోటర్ గూడూరు నాగయ్య సూచించిన మార్గంలో ముందుకెళ్తున్నామన్నారు. పట్టణంలోని ఎర్రగుంటలో లయన్స్ క్లబ్ ఆసుపత్రి ఉందని, ఇందులో కంటి వైద్య నిపుణులు కిరణ్‌కుమార్ పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైన వారికి అక్కడే ఉచితంగా ఆపరేషన్ చేసి, కంటి అద్దాలు ఇస్తారన్నారు. లేజర్ చికిత్సను కూడా తక్కువ ఖర్చుతో చేస్తారన్నారు. శిబిరంలో ఆప్తమాలజీ అసిస్టెంట్ నాగేంద్ర 56 మందికి పరీక్షలు చేయగా 32 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వీరికి ప్రకటించిన తేదీన కంటి ఆపరేషన్ ఉచితంగా చేయిస్తామని తెలిపారు. శిబిరంలో మోహన్‌దాస్, కుళ్లాయప్ప, రాజగోపాల్, రాధాకృష్ణ, ఉట్టి శివప్రసాద్, ముక్తాపురం కృష్ణ, పల్లె వేణుగోపాల్, చందా నాగరాజు, పుట్లూరు నరసింహులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని పరిగి రోడ్డులో సోమవారం నుండి రెండు రోజులపాటు ముస్లిం మైనార్టీలు నిర్వహించే ఇస్తే మా ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి ఆదివారం పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ కేంద్రాలను పరిశీలించి మత పెద్దలతో చర్చించారు. ఇస్తేమా నిర్వహణ కోసం మున్సిపాలిటీ పరంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అదేవిధంగా ఆరోగ్యపరంగా అత్యవసరమైతే విశ్వతేజ ఆసుపత్రి డాక్టర్ విశ్వనాథ్ రెడ్డిని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, వైసిపి నాయకులు హబీబ్, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్ల పరిశీలనలో మున్సిపల్ చైర్మన్, తదితరులు

పిహెచ్‌సికే పరిమితమైన 108..!

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన 108 వాహనం 15 రోజులుగా పిహెచ్‌సి ప్రాంగణానికే పరిమితమైంది. వైద్యం అత్యవసరమైన మండల వాసులు 108 నెంబర్‌కు ఫోన్ చేస్తుండగా వారు రొద్దం, గోరంట్ల చుట్టుపక్కల మండలాల నుంచి పంపిస్తున్నారు. దీంతో 108 సేవలు వేళకు అందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో ఏర్పాటు చేసిన 108 వాహనం ఇలా వృథాగా ఉండడం విమర్శలకు దారితీస్తోంది. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వాహనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని మండల వాసులు కోరుతున్నారు.

పిహెచ్‌సి ఆవరణలో నిలిచిన 108 వాహనం

సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు

సహకార శాఖ జిల్లా అధికారి కృష్ణానాయక్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

రైతుల సంక్షేమానికి వారి అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నేతృత్వంలో ప్రాథమిక సహకార పరపతి సంఘాల ద్వారా మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని జిల్లా సహకార శాఖ అధికారి కృష్ణనాయక్ తెలిపారు. కేవలం రైతుల అభివృద్ధి కోసమే ప్రాథమిక సహకార సంఘాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దాదాపు 75 ఏళ్ల క్రితమే ఈ సంఘాలను(సొసైటీ) ప్రభుత్వం ఏర్పాటు చేసి రైతులకు రుణ సదుపాయాలు కల్పిస్తోంది. ఆయా సంఘాల నుంచి ఐదు వేల మంది సభ్యులుగా ఉంటారు. ఆ సంఘాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు సరఫరాలతో పాటు రబీ, ఖరీఫ్ సీజన్లో అవసరమైన వారికి రుణ సదుపాయాలు కూడా కల్పిస్తారు. ఆయా సంఘాలకు కేవలం రైతుల ద్వారానే అధ్యక్షులు, డైరెక్టర్లను ఎన్నికల ద్వారా ఎన్నుకుంటారు. ఈ పాలకవర్గం రైతుల అభ్యున్నతికి కృషి చేస్తుంది. పంటల పెట్టుబడికి, వ్యవసాయానికి ఆ సంఘాలు రుణాలు అందిస్తాయి. చాలామంది రైతులు ఈ సంఘాల ద్వారానే రుణాలు పొందుతారు. కొన్ని సంఘాల ఆధ్వర్యంలో సహకార బ్యాంకులు ఏర్పడ్డాయి. పాలకవర్గం సిఫారసుతో సహకార బ్యాంకులో రుణాలు అందిస్తారు. అతివృష్టి, అనావృష్టితో ఇబ్బందులను ఎదుర్కొంటున్న రైతుల కోసం మరిన్ని సేవలు అందించడానికి కంప్యూటరైజేషన్ చేపట్టారు. దీంతో ఇకపై ఆన్ లైన్ ద్వారా సేవలు అందించవచ్చు. ఉమ్మడి వ్యవసాయం, ఉమ్మడి వ్యాపారాలను రైతులు చేసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో రైతులకు అందిస్తున్న సేవలపై జిల్లా

సహకార శాఖ అధికారి కృష్ణనాయక్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి? ఎంతమంది సభ్యులు ఉన్నారు?

జవాబు : జిల్లాలో 54 ప్రాథమిక సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. అందులో 1.96 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. రైతులందరితో ఈ కేవైసీ చేయించి కంప్యూటరీకరణ చేస్తున్నాము. ఈ పని మరో 10 రోజులలో పూర్తి కానుంది. దీంతో రైతులకు ఆన్ లైన్ ద్వారా మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుంది.

ప్ర : రైతులకు సంఘాల ద్వారా అందిస్తున్న సేవలు వివరించండి?

జ : రైతులకు గతం నుంచి పంట పెట్టుబడికి, వ్యవసాయానికి అవసరమైన రుణాలు అందిస్తున్నాము ప్రస్తుతం ఉమ్మడిగాను, వ్యక్తిగతంగా కూడా రైతుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటున్నాం. ఉమ్మడి వ్యాపారాలు చేసుకునే రైతులకు ఉపయోగపడే విధంగా సహకారం అందించడం జరుగుతుంది. ఉమ్మడిగా ఎరువుల అమ్మకం, పాల డైరీ, పాల ఉత్పత్తులు, పాడి పశు వులు, ట్రాక్టర్లు, గ్యాస్ కనెక్షన్, పెట్రోల్ బంక్ నిర్వహణ, పచ్చి గడ్డి పెంచడం, తదితర 25 రకాల వ్యాపారాలు నిర్వహించుకుని అభివృద్ధి చెందడానికి అవకాశం కల్పిస్తున్నాం.

ప్ర : రైతుల ఉమ్మడి వ్యాపారాలకు విధానాలు ఏమిటి?

జ : సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న రైతులు ఉమ్మడిగా రైతులకు సంబంధించిన వ్యాపారాలు చేపట్టవచ్చు. ఈ విధంగా జిల్లాలో ఇప్పటికే 18 సంఘాలు పనిచేస్తున్నాయి. ఈ వ్యాపారాలు చేపట్టడానికి రైతులు రూ.25 లక్షలు పెట్టుబడి పెడితే ప్రభుత్వం మరో రూ. 25 లక్షలు సమకూర్చుతుంది. ఇప్పటికే సోమందేపల్లి, బండ్లపల్లి సొసైటీలలో వ్యాపారాలు జరుగుతున్నాయి. వారి వివరాలు అన్ని కంప్యూటర్లో నిక్షిప్తమయ్యాయి. త్వరలోనే మిగిలిన సంఘాలకు కూడా కంప్యూటరీకరణ పూర్తి అవుతుంది. దీంతో మొత్తం వ్యవహారాలన్నీ ఇకపై ఆన్‌లైన్ ద్వారా జరుగుతాయి. రైతులకు ఉపయోగపడే విధంగా సేవలు కొనసాగుతాయి. వ్యాపార నిర్వహణలో అవసరమైన శిక్షణను కూడా రైతులకు ఇవ్వడం జరుగుతుంది. రైతులకు ఉమ్మడి వ్యాపారాలలో వచ్చే ఆదాయం సమంగా పంచుకోవచ్చు. ప్రభుత్వం అందించే రాయితీలు కూడా రైతులు పొందే అవకాశం ఉంటుంది.

ప్ర : రైతులకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.?

జ : ఉమ్మడిగా లేదా వ్యక్తిగతంగా రైతులకు ఉపయోగపడే వ్యాపారాలు నిర్వహించుకోవచ్చు. సంఘాలలో ఉన్న రైతులు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలి. తద్వారా మరికొన్ని సంఘాలకు రుణ సౌకర్యం కల్పించడానికి అవకాశం ఉంది. మొండి బకాయిల స్థాయికి చేరకుండా సక్రమంగా వ్యాపారాలు నిర్వహించుకోవాలి. తద్వారా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. ఆయా వ్యాపారాల పర్యవేక్షణ ఆయా సంఘాల అధికారులు చూస్తుంటారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

కృష్ణానాయక్

దోచుకున్న వ్యక్తికే మరో టెండర్..!

కెజిబివి టెండర్లలో గోల్‌మాల్.. అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ (కెజిబివి) వసతి గృహాలకు పౌష్టికాహారం సరఫరా చేసే టెండర్లలో అవినీతిపరులకే మరోమారు అధికారులు టెండర్లు కట్టబెట్టినట్లు విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. గతంలో అంగన్వాడీలకు పాలు, గుడ్లు సరఫరా చేస్తూ అవినీతికి పాల్పడిన వ్యక్తికే మరోమారు అధికారులు టెండర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ వ్యక్తి అవినీతి, అక్రమాలపై గతంలో పలు దినపత్రికల్లో కథనాలు వచ్చాయి. కలెక్టరేట్‌లో గత డిసెంబర్ 31వ తేదీ నిర్వహించిన టెండర్లలో అదే వ్యక్తి కెజిబివి వసతి గృహాలకు మాంసం సరఫరా చేసే టెండర్ దక్కించుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో జరిగిన సంఘటన

ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్వాడీ కేంద్రాలకు ప్రతినెల పాలు, గుడ్లు పౌష్టికాహారం పంపిణీ చేస్తోంది. ఇందులో ఓ వ్యక్తి కాసులకు కక్కుర్తి పడి హిందూపురం పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు అరకొరగా పాలు సరఫరా చేసి మిగిలినవి ప్రయివేటుగా అమ్ముకొని సొమ్ము చేసుకున్నాడు. ఇదే విషయమై పలు ఆరోపణలు రావడంతో అప్పుడు సిడిపిఒను బాధ్యురాలిని చేసి సస్పెండ్ చేశారు. ఆ మొత్తాన్ని అధికారులు ఆ వ్యక్తి నుంచి ఇప్పటి వరకూ రికవరీ చేయకపోవడం గమనార్హం.

ప్రస్తుతం జరిగినది

ఈ క్రమంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో కెజిబివి వసతి గృహాలకు పౌష్టికాహారం సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానించారు. పాలు, గుడ్లు, మాంసం, పండ్లు, కూరగాయలు, తదితర నిత్యావసరాలు సరఫరా చేసేందు కోసం పలువురు టెండర్లు దాఖలు చేశారు. ఇందులో కొన్ని టెండర్లు తిరస్కరించగా మరి కొందరు టెండర్‌లో పాల్గొన్నారు. ఇందులో అధికారులు అనుభవం లేని కారణాన్ని చూపుతూ కొత్తవారికి అవకాశమే ఇవ్వలేదు. గతంలో హిందూపురంలో పాలు సరఫరాలో భారీగా అవినీతికి పాల్పడిన వ్యక్తికే మళ్లీ ఓ కాంట్రాక్టు కట్టబెట్టడంపై విమర్శలు వస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం ఇదే విషయమై ఓ టెండర్‌దారుడు మాట్లాడుతూ తనకు అన్ని అర్హతలు ఉన్నయని, సకాలంలో టెండర్ దరఖాస్తు చేసినా అధికారులు కావాలనే తన దరఖాస్తులను రెండు రోజులు పక్కనపెట్టి కాంట్రాక్టు దక్కకుండా చేశారని వాపోయాడు. గతంలో అక్రమాలకు పాల్పడిన వ్యక్తికే అధికారులే మరోమారు కాంట్రాక్టు కట్టబెట్టడం వెనుక ఆంతర్యం ఏమిటి అని ప్రశ్నించారు. ఈ విషయంపై న్యాయపోరాటం చేస్తానని తెలిపారు. 16 మంది టెండర్లు వేస్తే కొత్తవారిని అందరినీ బయటికి వెళ్లిపోండని అధికారులు చెప్పడం దుర్మార్గమన్నారు. అధికారులు కుమ్మక్కై అవినీతిపరులకే టెండర్లు కట్టబెట్టారని మండిపడ్డారు. హిందూపురం నియోజకవర్గంలో కూడా పౌష్టికాహారం సరఫరాలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని ఈ విషయాన్ని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.



4	Name of the Tenderer	Name of the Selected Firm	Item
5	SAVITRHI	SRI LAKSHMI VENKATESWARA ENTERPRISES KOVUR NAGAR, ANANTHAPURAMU MOBILE:8881059999	MILK (80 ml boost+20ml ragi ; 50 ml lunch; 50 ml dinner)
6	DHARSHAN	RAGHAVENDA GROUPS , POLICE COMPLEX, ANANTHAPURAMU MOBILE:8179993273	FRUITS
7	RAJA	GOPANNA RAJA, ALEKHA FUNCTION HALL, ANANTHAPURAMU MOBILE:9908829882	VEGETABLES
8		SRI LAKSHMI SREENIVASA GENERAL STORES, 3RD ROAD, ANANTHAPURAMU MOBILE:9059822331	EGGS
9	NAGARAJU	SREE BEERALINGESWARA, D.No:26/4/1500, RTC, COLONY, HINDUPUR MOBILE:9949132918	CHICKEN

టెండర్ దాఖలు చేసిన వారి వివరాలు

పునఃపరిశీలిస్తాం..

తాను ఇటీవలే కొత్తగా బాధ్యతలు చేపట్టా. ఆ విషయాలేవీ తనకు తెలియవు. మరోమారు పరిశీలిస్తాం. – డిఇఒ క్రిష్టప్ప

'ఉపాధి'లో నిబంధనలకు తూట్లు..!

యథేచ్ఛగా ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, టిఎల అక్రమాలు
సామాజిక తనిఖీల్లో వెల్లడైనా చర్యలు శూన్యం

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కొందరు అవినీతి, స్వార్థపరులైన ఉద్యోగుల వల్ల మండలంలో అభాసుపాలవుతోంది. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లు, టిఎలు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం, మండల స్థాయి అధికారుల అండదండలతో వారు ధనార్జనే ధ్యేయంగా అడ్డూ అదుపులేకుండా ఉపాధి హామీ పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడుతు న్నట్లు తెలుస్తోంది. వీరి అవినీతి భాగోతం సామాజిక తనిఖీ ప్రజావేదికల్లో బయటపడినా ఎలాంటి చర్యలు లేకపోవడంతో వారు మరింత రెచ్చిపోతున్నారని కూలీలు, ప్రజలు గ్రామాల్లో బాహాటంగానే చర్చించుకుంటున్నారు. గ్రామాల్లో వలసల నివారణ, పని చేసే సామర్థ్యం ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించడం, కూలీలకు రోజుకు నిర్ణయించిన కూలి ఇవ్వాలన్నదే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రధాన లక్ష్యం. కూలీలతో మాత్రమే పని చేయాలి. యంత్రాలను ఉపయోగించకూడదు. అయితే ఈ చట్టం నిబంధనలకు తూట్లు పొడుస్తూ జెసిబి, తదితర యంత్రాలతో పనులు చేస్తూ కూలీల పొట్ట కొడుతున్నారు. హాజరైన కూలీల వివరాలను పని ప్రదేశంలోనే యాప్ ద్వారా రోజుకు రెండు దఫాలుగా నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు, టిఎలు ఒక్కటై పనులకు హాజరైన ఒకటి, రెండు గ్రూపుల సభ్యులతో ఉన్న ఫొటోలనే యాప్‌లో అప్ లోడ్ చేసి, పనికి రాని వారిని మస్టర్లలో పేర్లు రాసి అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని న్యామద్దెల, వెంకటంపల్లి, ఓబుళంపల్లి, పులేటిపల్లి, మేడాపురం, ప్యాదిండి, నాగసముద్రం పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు సైతం అక్రమాలకు పాల్పడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈ విషయాన్ని ఇప్పటికే ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. ఉపాధి హామీలో అవినీతి అక్రమాలను డ్వామా పిడి దృష్టికి తీసుకెళ్లగా ధర్మవరం ఎపిడి, చెన్నేకొత్తపల్లి ఎంపిడిఒ, ఎపిఒల దృష్టికి తీసికెళ్లండని సూచించినట్లు తెలుస్తోంది. ధర్మవరం ఎపిడి దృష్టికి తీసుకెళ్లగా నేడో, రేపో పనుల వద్దకు వెళ్లి పరిశీలిస్తానని తెలిపారు. ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లగా క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిశీలించి అక్రమాలకు పాల్పడిన వారిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. ఎపిఒ వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. ఏదేమైనా ఉపాధి హామీలో అవినీతి, అక్రమాలను అరికట్టడంతో పాటు అడిగిన వారందరికీ పారదర్శకంగా పనులు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సేవాభావం కలిగి ఉండాలి : జిల్లా జడ్జి

ప్రజాశక్తి-కొత్తచెరువు

ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండి సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా జడ్జి శివశంకర్, రాజీవ్ ప్రతిభా అవార్డు గ్రహీత, మానవతా సంస్థ చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కేశపురం జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఆ గ్రామ నివాసి అమెరికాలో ఉన్న ఎన్‌ఆర్‌ఐ ఆదిశేషారెడ్డి తన తండ్రి, రిటైర్డ్ హిందీ పండిట్ జ్ఞాపకార్థం చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ ఆసుపత్రి సహకారంతో పది రోజుల పాటు కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకూ వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అక్కడే మొబైల్ బస్సుల్లో డాక్టర్లు ఆపరేషన్ చేశారు. రెండు రోజుల తర్వాత మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. వైద్య శిబిరం నిర్వహించినందుకు రిటైర్డ్ హిందీ పండిట్ కుటుంబ సభ్యులను జడ్జి అభినందించి సన్మానించారు. జడ్జి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లి ఆపరేషన్లు చేయించుకోవాలంటే పేద ప్రజలు ఇబ్బందులు పడతారని, ఇలాంటి శిబిరాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి నరేందర్‌రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్ వెంకటరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా జడ్జి శివశంకర్, తదితరులు

కాణిపాకం వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

కాణిపాకంలో కొలువుదీరిన శ్రీవరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు ఎంఎస్.రాజు దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీమోహన్ స్వాగతం పలికి ఆలయంలోకి మర్యాదపూర్వకంగా తీసుకెళ్లారు. అనంతరం ఆలయ ఈఓ, ప్రధాన అర్చకులు పూర్ణకుంభం, మంగళవాయిద్యాలతో ఎమ్మెల్యే రాజుకి స్వాగతం పలికారు. గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే రాజుకి స్వామివారి హారతి, తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం రాజుకి ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ ఈఓ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఎమ్మెల్యే వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వెంకటప్ప, దరూర్ ఓబుళనాయుడు, నాగరాజు, ఆది నరసింహులు, శ్రీనివాసులు, గణేష్, శివ ఉన్నారు.

ఎమ్మెల్యే, టిటిడి సభ్యులు ఎంఎస్.రాజు ఆదివారం మెట్ల మార్గంలో కాలినడకన తిరుమల కొండ ఎక్కి శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు. స్వామిని దర్శించుకున్న వారిలో రాయల్ మురళి, పి.వెంకటప్ప, ఓబుళనాయుడు, నాగరాజు, ఆది నరసింహులు, శ్రీనివాసులు, గణేష్, శివ, పవన్ కుమార్ ఉన్నారు.

తిరుమల కొండపై ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, టిడిపి నాయకులు

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరుని రథోత్సవం

నాగలమడకలో సుబ్రహ్మణ్యేశ్వరుని రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీత

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని ఎస్ఎల్‌వి మార్కెట్(పాత బస్టాండ్)లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర నాగదేవతల ఆలయంలో ఆదివారం రథోత్సవం, సుబ్రహ్మణ్య షష్టి పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు విజయ్‌కుమార్‌శర్మ, వారి శిష్య బృందం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నాగదేవతల విగ్రహాలను కొలువు దీర్చగా ముఖ్య అతిథులు తాడును లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం రథోత్సవం పట్టణ పురవీధుల గుండా సాగింది. ముఖ్య అతిథులుగా నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జన సేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, మంత్రి సత్యకుమార్ వ్యక్తిగత కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు హాజరవగా అర్చకులు స్వాగతం పలికారు. చివరగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రథోత్సవం, వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నాగలమడకలో..

చెన్నేకొత్తపల్లి : ఆంధ్ర, కర్నాటక సరిహద్దులో వెలసిన సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాగలమడకలో శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఎమ్మెల్యే పరిటాల సునీత దర్శించుకున్నారు. నాగల మడకలో సుబ్రహ్మణ్యేశ్వర షష్టి వేడుకలు రెండు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజలు, రథోత్సవంలో ఎమ్మెల్యే సునీత పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే సునీత, మాజీ మంత్రి వెంకటరమణప్ప, పావగడ ఎమ్మెల్యే వెంకటేష్‌లకు ఆలయ అధికారులు, స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యేలు సునీత, వెంకటేష్ రథానికి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించి రథాన్ని లాగారు. అనంతరం ఆలయ పరిసరాల్లో రథోత్సవం నిర్వహించారు.

ధర్మవరంలో స్వామి, అమ్మవార్లను ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

చిరుధాన్యాల సాగు పెంచాలి

రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వాలి
వ్యవసాయ శాఖ కమిషనర్, డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు



పంటను పరిశీలిస్తున్న ఢిల్లీరావు

ప్రజాశక్తి-కదిరిటౌన్

చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులకు సూచించారు. ఆయన ఆదివారం మండలంలోని బత్తలపల్లి గ్రామంలో రైతు గుర్రప్ప పొలంలో పండించిన చియా పంటను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. రైతులు మాట్లాడుతూ కదిరి ప్రాంతంలో కొర్ర కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని విన్నవించారు. ఆర్త్–360 ప్రాసెసింగ్ యూనిట్ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ చిరుధాన్యాలైన కొర్రలు, సామలు, అరికలు, అండు కొర్రలు, రాగులు, జొన్న, సజ్జ, ఊదర్లు ప్రాసెసింగ్ గురించి రైతులకు వివరించారు. ఢిల్లీరావు మాట్లాడుతూ చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలని, ప్రాసెసింగ్, ప్రొక్యూర్మెంట్ విధానాలపై రైతుల్లో అవగాహన పెంచాలని, చిరుధాన్యాల వంటకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన గాండ్లపెంట మండలంలోని కటారుపల్లిలో రెడ్స్ సంస్థ నిర్వహిస్తున్న ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించారు. అలాగే కదిరి మండలంలోని మోటుకుపల్లి గ్రామంలో తిరుమల్‌రెడ్డి పండించిన టమోటా పంటను సందర్శించి పంట యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణకు సలహాలు సూచనలు ఇచ్చారు. మార్కెటింగ్ సదుపాయాలపై చర్చించారు. ఆయన వెంట ఆర్డీవో వివిఎస్.శర్మ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వైవి.సుబ్బారావు, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్, కదిరి డివిజన్ ఎడిఎ ఎస్.సత్యనారాయణ, డిఆర్‌సి పుట్టపర్తి ఎడిఎ సనావుల్లా, కదిరి ఏవో డి.శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాపరెడ్డి, ఎపి సీడ్స్ మేనేజర్ వెంకటసుబ్బయ్య, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఉన్నారు.

చిరుధాన్యాలు ఆరోగ్యానికి శ్రేయస్కరం

గాండ్లపెంట : చిరుధాన్యాలు ఆరోగ్యానికి శ్రేయస్కరం అని వ్యవసాయ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. మండలంలోని కటారుపల్లి క్రాస్ వద్ద రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిరుధాన్యాల నూర్పిడి ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం శ్రేయస్కరమని, శరీరానికి మంచి పౌష్టికాహారం లభిస్తుందని, తద్వారా ఎలాంటి జబ్బుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రభుత్వం కొర్రలు, రాగులు, సామలను రైతుల వద్ద కొనుగోలు చేసి నూర్పిడి అనంతరం ప్రజలకు తక్కువ ధరకు పంపిణీ చేస్తే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ అధికారి సుబ్బారావు, ఆర్డీవో వివిఎస్.శర్మ, కదిరి ఎడి సత్యనారాయణ, ఏవో లక్ష్మీప్రియ, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ అధినేత భానుజా, కోఆర్డినేటర్ ఎస్.గంగరాజు, మహిళా రైతులు పాల్గొన్నారు.

మలకవేములను మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మలకవేములను మండలంగా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మలకవేముల కేంద్రంగా నూతన మండలం ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. మండలంలోని మల్లేపల్లి, తప్పెటవారిపల్లి, కొండగట్టుపల్లి, ఒడ్డుకిందతండా, మలకవేముల, సానేవారిపల్లి పంచాయితీల పరిధిలోని గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా, కుల సంఘాల నాయకులు, ప్రజలు దాదాపు 250 మంది ఆదివారం ముదిగుబ్బలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముందుగా ఓ బ్యానర్ చేత పట్టి పట్టణంలో ర్యాలీ చేపట్టారు. మలకవేముల కేంద్రంగా ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలని అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

జనసేనలో 300 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని జనసేనపార్టీ కార్యాలయంలో ఆదివారం 300 కుటుంబాలు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి చిలకం పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. జనసేనలో చేరిన వారు మాట్లాడుతూ డిప్యూటీ సిఎం, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి జనసేన పార్టీ 28వ వార్డు ఇన్‌ఛార్జి సరితాల బాషా ఆధ్వర్యంలో పార్టీలో చేరామని తెలిపారు. పట్టణంలో జనసేన పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు చిలకం మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యం ఇస్తామని, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

చిలకం సమక్షంలో జనసేనలో చేరిన నాయకులు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-రొద్దం

బాబు(ఫైల్‌ఫొటో)

కర్నాటకలోని బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలం లోని ఎం.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎం.కొత్తపల్లికి చెందిన కురుబ బాబు(23) జీవనోపాధి కోసం బెంగళూరు వెళ్లి అక్కడ ఓ ఫ్యాక్టరీలో పని చేసేవాడు. విధులకు వెళ్లేందుకు శనివారం రాత్రి బెంగళూరులోని నెలమంగల టోల్ ప్లాజా వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో తల పూర్తిగా పగిలిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. అక్కడి పోలీసులు సమాచారం ఇవ్వడంతో బాబు కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామం తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి..

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడ్డం రంగనాథ స్వామి దేవాలయ సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. శనివారం అర్ధరాత్రి రైలు కిందపడి మృతి చెంది ఉండవచ్చునని చెప్పారు. మృతుని ఆచూకీ కోసం ప్రయత్నించినా ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదన్నారు. మృతుడిని గుర్తించగలిగిన వ్యక్తులు హిందూపురం రైల్వే పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

బైక్‌లు ఢీ.. నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని గొల్లపల్లి గ్రామ సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఆదిమూర్తి, మండలంలోని బడన్నపల్లి గ్రామానికి చెందిన రాజారెడ్డి, కార్తీక్‌రెడ్డి ఆదివారం ద్విచక్ర వాహనంపై ధర్మవరం నుంచి మరూరు గ్రామం బయల్దేరారు. అదే సమయంలో రాప్తాడు మండలంలోని మరూరు గ్రామానికి చెందిన మూర్తి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి ధర్మవరం వస్తూ ఉండగా గొల్లపల్లి గ్రామ సమీపంలో వేగంగా వచ్చి ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఆ నలుగురికి స్వల్ప గాయాలు కాగా స్థానికులు హుటాహుటిన ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డే ఓబన్న చరిత్ర పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

రచయిత బత్తుల గంగరాజు రచించిన వడ్డే ఓబన్న సంక్షిప్త చరిత్ర పుస్తకాన్ని ఆదివారం పట్టణంలోని సెయింట్ థామస్ పాఠశాలలో సీనియర్ పాత్రికేయులు జయరామిరెడ్డి, వక్తల సమక్షంలో ఆవిష్కరించినట్లు శ్రీఖాద్రీ వడ్డెర సేవా సంఘం అధ్యక్షులు దాబా గంగయ్య, సైదాపురం రమణ తెలిపారు. వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి వీరుడు వడ్డే ఓబన్న సంక్షిప్త చరిత్రను రాయడం గర్వకారణం అన్నారు. కదిరిలో వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఓబన్న చరిత్రను పుస్తక రూపంలో అందిచడం చాలా గొప్ప విషయమన్నారు. వడ్డే ఓబన్న త్యాగాలు, పోరాటాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతపురం పుస్తక రచయిత గంగరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీఖాద్రీ వడ్డెర సేవా సంఘం ఉపాధ్యక్షులు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి సంపంగి గోవర్ధన్, బత్తల నారాయణప్రసాద్, జైనుల్లా, త్రిలోక్, నాయకులు రమణ, ఆదినారాయణ, ఉత్తప్ప, శ్రీనివాసులు, ఆంజనేయులు, బి.చంద్ర, నాయుడు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

ప్రజాశక్తి-పెనుకొండ

దైవదర్శనానికి వెళ్లి వస్తూ ప్రమాదానికి గురై వివాహిత మృతి చెందిన సంఘటన ఆదివారం పెనుకొండలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు పట్టణంలోని మారుతి నగర్ లో నివాసం ఉంటున్న రామాంజనేయులు, ఆదిలక్ష్మమ్మ(48) అనే దంపతులు ద్విచక్ర వాహనంలో రొద్దం మండలం చిన్నమంతూరులో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి పెనుకొండకు వస్తుండగా పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ సమీపంలో ఆ రోడ్డుపై ఆవు అడ్డం రావడంతో ఢీకొన్నారు. దీంతో దంపతులు రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆదిలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. ఆంజనేయులుకు గాయాలుకాగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆదిలక్ష్మమ్మ

చేనేత ఐక్య కులాల సభ విజయవంతంపై హర్షం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని శివానగర్‌లో వెలసిన శివాలయం ఆవరణలో గత శనివారం నిర్వహించిన చేనేత ఐక్య కులాల ఆధ్వర్యంలో నిర్వహించిన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సన్మానసభ విజయవంతమైందని రాష్ట్ర చేనేత నాయకురాలు సంకారపు జయశ్రీ తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో సన్మానసభను విజయవంతం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇకపై చేనేత పరిశ్రమను కాపాడుకునే దిశలో పయనిస్తామని తెలిపారు. చేనేత కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యే కందికుంట చట్టసభల్లో మాట్లాడేందుకు అవకాశం ఉందన్నారు. సన్మాన సభ విజయవంతం కావడం పునాది లాంటిదని, మున్ముందు చేనేతల సమస్యలపై ప్రతి నెలా అందరూ కూర్చొని చర్చిస్తామని తెలిపారు.

ఘనంగా అంధుల దినోత్సవం

ప్రజాశక్తి-తలుపుల

స్థానిక భవిత కేంద్రంలో ఆదివారం అంధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఇఒ వెంకటరమణ, ఎంపిపి మెయిన్ స్కూల్ హెచ్‌ఎం శాంతమ్మ, ఆర్‌డిటి ఉద్యోగి నారాయణస్వామి, ఐఆర్‌పిలు భారతి, శ్రీనివాస్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ అంధుల కోసం లూయిస్ బ్రెయిలీ 'బ్రెయిలీ లిపి'ని కనుగొన్నారన్నారు. తద్వారా ఎంతోమందికి మేలు జరిగిందన్నారు. అందుకే ఆయన పేరు మీద జనవరి 4వ తేదీ ఆయన జయంతిని దినోత్సవంగా జరుపుకుంటా మన్నారు. అనంతరం 8వ తరగతి విద్యార్థికి రోలేటర్ అందజేశారు. పిల్లలకు స్వీట్స్ పంచిపెట్టారు.

పొలానికి దారి విషయంలో ఘర్షణ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పొలానికి దారి విషయమై ఆదివారం మండలంలోని బిల్వంపల్లి గ్రామానికి చెందిన కార్తీక్, అదే గ్రామానికి చెందిన నరసింహులు, అతని భార్య చంద్రకళ ఘర్షణ పడ్డారు. వారు వారి భూముల మధ్యలో దారి విషయంలో పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ గొడవలో ఇరువైపుల వారు గాయపడ్డారు. గాయపడిన వారిని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహారాజ శ్రీ పెనుకొండ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No.16/2022 in O.S.No.64/2008
Between:
ఆర్.చంద్రశేఖర్ ...డిక్రీదారు
-మరియు-
యస్.గాయత్రమ్మ ఉరిఫి గాయత్రి మరియు ఇతరులు ...జెడ్జిమెంట్ డెబిటార్లు
To
04:పుష్ప W/o బి.గణేష్ కుమార్ D.No:1.236-9.B, 1st Floor, లక్ష్మి నిలయం, వజ్రాలపేట, పెనుకొండ.
05:లలిత D/o Late రామచంద్రారెడ్డి Ex.M.P D.No:1.236-9.B, Down Floor, లక్ష్మి నిలయం, వజ్రాలపేట, పెనుకొండ.
నోటీసు
ఇందుమూలముగా పై అమలు అర్జీలోని 4 మరియు 5వ ప్రతివాదులు అయిన మీకు తెలుపునది ఏమనగా పై అమలులోని అర్జీ డిక్రీదారు, మీపై అమలు అర్జీ దాఖలు చేసినాడని, సదరు అమలు అర్జీనందు మీకు రూల్ 54 అటాచ్‌మెంట్ నోటీసు జారీ కావలసియున్నది. కావున మీరు **08/01/2025**వ తేదిన పై కోర్టు వారి ఎదుట ఖుద్దున గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు లేని పరోక్షములో పై అమలు అర్జీ మీ పరోక్షము నందు తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 08-01-2025
సి.ఆర్.నాగార్జున,
డిక్రీదారు వకీలు, పెనుకొండ.